వృద్ధిరేటు డౌన్

ఈసారి జీడీపీ 6.5-7 శాతమే • ఆర్థిక సర్వే అంచనా

గతంలో కంటే దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనం

ధరల సెగ నేపథ్యంలో పేదలకు ఫుడ్ కూపన్లు, నగదు బదిలీ యోచన

చైనా ఎఫ్‌డీఐపట్ల మోదీ సర్కారు ఆసక్తి

చైనా నుంచి ఎఫ్‌డీఐలకు సంబంధించి అనుసరించాలనుకుంటున్న విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి పరిశీలించాలని కోరుతున్నా. వస్తూత్పత్తుల దిగుమతులు, పెట్టుబడుల మధ్య సమతూకం అవసరం. ఇప్పటికే చైనాతో భారత్ ద్రవ్యలోటు ఎక్కువగా ఉన్నది. ఇంకా ఆ దేశం నుంచి దిగుమతులు చేసుకుంటే లోటు మరింత పెరుగుతుంది. దీంతో దేశీయంగా ఒడిదొడుకులు ఏర్పడతాయి. కాబట్టి ముందుగా ఏయే రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలున్నాయో తెలుసుకుంటే ఉత్తమం. ఇది భారతీయ వ్యాపార, పారిశ్రామికవేత్తలకూ లాభిస్తుంది. అంతేగాని చైనా ఎఫ్‌డీఐలను ఆకర్షించాలని తొందరపాటు నిర్ణయాలు పనికిరావు.

-వీ అనంత నాగేశ్వరన్,
ప్రధాన ఆర్థిక సలహాదారు

చైనా నుంచి భారత్‌లోకి పెట్టుబడులు స్వల్ప కాలానికి ప్రయోజనం చేకూర్చినా.. దీర్ఘకాలంలో నష్టాలనే మిగులుస్తాయి. డ్రాగన్ ఎఫ్‌డీఐలు భారత ఆర్థిక భద్రతకు, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి ఇబ్బందే. పైగా తయారీ రంగంలో చైనాపై ఆధారపడే పరిస్థితి ఎంతో ప్రమాదకరం. భౌగోళిక రాజకీయ సమస్యలకు, సరఫరా ఒడిదొడుకులకు దారితీస్తుంది. అంతేగాక చైనా సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడితే అక్కడి సాంకేతిక నిపుణులు, సిబ్బందినే ఇక్కడికి తెచ్చుకుంటాయి. మనవాళ్లకు ఆ మెలకువల్ని నేర్పించేందుకు ఇష్టపడవు. ఇది దేశంలో నిరుద్యోగాన్ని పెంచేందుకు కారణం కాగలదు.

-అజయ్ శ్రీవాత్సవ, గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు

న్యూఢిల్లీ, జూలై 22: దేశ జీడీపీ వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) 6.5-7 శాతం మధ్యే నమోదు కావచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లోని 8.2 శాతంతో పోల్చితే 1.7-1.2 శాతం తగ్గడం గమనార్హం. సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. అయితే మంగళవారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రకటించనున్న క్రమంలో దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని తెలియపర్చే కీలక సర్వేలో వృద్ధిరేటు అంచనాలు పడిపోవడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (7.2 శాతం), ఇటు ఐఎంఎఫ్, ఏడీబీ (7 శాతం)లు విడుదల చేసిన అంచనాలకన్నా మోదీ సర్కారు అంచనా తక్కువగా ఉన్నదిమరి. కాగా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు.. భారత జీడీపీ వృద్ధి అవకాశాలను దెబ్బతీస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం ఈ సందర్భంగా పేర్కొన్నది. అయితే ఇన్నాళ్లూ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ఊదరగొట్టిన బీజేపీ ప్రభుత్వానికి.. వాస్తవ పరిస్థితులు మింగుడుపడకుండా తయారయ్యాయన్న వాదనలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో దేశ వృద్ధిరేటును వాస్తవం కన్నా ఎక్కువచేసి చూపుతున్నారన్న పలువురు ప్రముఖ ఆర్థికవేత్తల అభిప్రాయాలకూ ఇప్పుడు బలం చేకూరుతున్నది. మొత్తానికి ఈసారి భారత జీడీపీ 7 శాతంలోపేనని మోదీ సర్కారు ముందస్తు సంకేతాలను ఈ తాజా సర్వేతో ఇచ్చేసింది.

ఆహార ద్రవ్యోల్బణాన్ని ముడిపెట్టవద్దు

వరుస ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూపోతున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు ఆర్థిక సర్వే ఓ కీలక సూచన చేసింది. వడ్డీరేట్లను నిర్ణయించేటప్పుడు ఆహార ద్రవ్యోల్బణాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం ఆపేయాలన్నది. గత ఏడాది ఏప్రిల్ నుంచి రెపో రేటును ఆర్బీఐ.. ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా గరిష్ఠ స్థాయి (6.5 శాతం) లోనే ఉంచుతున్న విషయం తెలిసిందే. 2016 నుంచి ద్రవ్యోల్బణ ఆధారిత ద్రవ్యవిధానాన్ని ఆర్బీఐ ఆచరిస్తూ వస్తున్నది. దీంతో బ్యాంక్ రుణాల వడ్డీరేట్లూ అత్యధిక స్థాయిలోనే ఉంటున్నాయి. ఫలితంగా రుణగ్రహీతలపై ఈఎంఐల భారం తడిసి మోపెడవుతున్నది. అలాగే ఆయా రంగాలను నిధుల కొరత కూడా వేధిస్తున్నది. ఈ క్రమంలో ఇకపై ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకోవద్దని ఆర్బీఐకి కేంద్రం సూచించింది. ఇదిలావుంటే అధిక ఆహారోత్పత్తుల ధరలను ఎదుర్కొనేలా పేదలకు కూపన్లు లేదా నేరుగా నగదు బదిలీని కేంద్ర ప్రభుత్వం చేయాలని కూడా ఆర్థిక సర్వే సూచించింది. దీంతో వచ్చే నెల ఆర్బీఐ ద్రవ్య సమీక్షకు ప్రాధాన్యత ఏర్పడుతున్నది. ఇక వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఆహారోత్పత్తుల ధరలు దిగివస్తాయన్న ఆశాభావాన్నీ కేంద్రం ఈ సందర్భంగా కనబర్చింది.

చైనా ఎఫ్‌డీఐలపై ఆశ

అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎగుమతులు పెరుగాలన్నా.. స్థానికంగా తయారీ రంగం బలపడాలన్నా.. పొరుగు దేశం చైనా సహకారం అవసరమని ఆర్థిక సర్వేలో కేంద్రం పేర్కొనడం విశేషం. ఈ క్రమంలోనే చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ఆకర్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అయితే సరిహద్దుల్లో చైనాతో కుస్తీ పడుతూ.. వ్యాపార రంగంలో దోస్తీ చేయాలన్న వింత వాదనపై ఇప్పుడు ఒకింత విస్మయం వ్యక్తమవుతున్నది. చైనా సంస్థలు భారత్‌లో పెట్టుబడుల ద్వారా వేళ్లూనుకుంటే మున్ముందు విపరీత పరిణామాలే నన్న ఆందోళనలూ కనిపిస్తున్నాయి. నిజానికి భారత్‌తో సరిహద్దును పంచుకుంటున్న దేశాల నుంచి పెట్టుబడులకు.. ఏ రంగంలో నైనా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి.



జీసీసీల రాకలో తెలంగాణ భేష్

దేశంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) సంఖ్య పెరుగడంలో గత తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన విధానం భేష్ అని ఆర్థిక సర్వే కొనియాడింది. నేడు బహుళ జాతి సంస్థలు భారత్‌లో తమ జీసీసీలను ఏర్పాటుచేసేందుకు ముందుకొస్తున్నాయంటే దాని వెనుక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల కృషి ఎంతో ఉన్నదని ఆర్థిక సర్వే ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్.. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో డాటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన పరిస్థితుల్ని కల్పించిన సంగతి విదితమే. దీంతో ఎన్నో ప్రముఖ సంస్థలు ఇక్కడ జీసీసీలను నెలకొల్పాయి. కాగా, 2012లో దేశంలో దాదాపు 720 జీసీసీలుండగా, 2023 నాటికి అవి 1,600లకు పెరిగాయి. ఐటీ, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఫైనాన్స్, టెలికం, ఏరోస్పేస్, ఆటోమోటివ్, హెల్త్‌కేర్, ఫార్మా, చమురు-గ్యాస్, బీపీవో, ఇంజినీరింగ్ ఉత్పత్తులకు ఇవి దన్నుగా నిలుస్తున్నాయి.

ఉద్యోగులకు శాపం ఏఐ

టెక్నాలజీ రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న కృత్రిమ మేధస్సు..ఉద్యోగులకు శాపంగా మారింది. అన్ని రంగాల్లో ప్రతిభ కలిగిన ఉద్యోగులను ఈ టెక్నాలజీ మింగేస్తున్నదని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ఈ టెక్నాలజీతో భవిష్యత్తులో ఉద్యోగ కల్పనపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ తెలిపారు. కార్పొరేట్ రంగ సంస్థలు ఏఐ కార్మికులను స్థానభ్రంశం చేయడం కంటే శ్రమను పెంచే మార్గాల గురించి గట్టిగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నదన్నారు. మరోవైపు, ఐటీ రంగ సంస్థలు గత రెండేండ్లుగా ఉద్యోగ నియామకాలను తగ్గించాయని సర్వే వెల్లడించింది. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో ప్రతిభ కలిగిన ఉద్యోగులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని పేర్కొంది. మరోవైపు, 2030 నాటికి ప్రతియేటా వ్యవసాయేతర రంగాల్లో 78 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ ఉద్యోగ కల్పనలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపింది.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టీల్ బ్యాంక్‌లోని పాత్రలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు (ఫైల్)

మెరిసిన సిద్దిపేట స్టీల్ బ్యాంక్

ఆర్థిక సర్వేలో ప్రత్యేక గుర్తింపు

మొదటిపేజీ తరువాయి...

కార్యక్రమాలు జరిగిన ఈ స్టీల్ బ్యాంకులోని పాత్రలను కిరాయికి ఇస్తారు. తద్వారా ప్లాస్టిక్ నియంత్రణ మరింత కట్టుదిట్టంకానున్నది. ఈ స్టీల్ బ్యాంకులను ఆయా వార్డుల్లో వున్న మెప్మా ఆధ్వర్యంలోని స్వయం సహాయక బృందాలు నిర్వహిస్తున్నాయి. తద్వారా మహిళకు ఉపాధి లభించడంతోపాటు ప్లాస్టిక్ మహమ్మారిని నివారించడానికి మార్గం ఏర్పడినట్లు అయింది. ఇదే స్ఫూర్తితో సిద్దిపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయడంతోపాటు జాతీయ స్థాయిలోనూ బర్థన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసేయోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. కాలుష్య నియంత్రణకు సిద్దిపేట స్టీల్ బ్యాంక్ తీసుకుంటున్న చర్యలు ఎంతో అద్భుతమని కేంద్రం ప్రశంసలు కురిపించింది.

ఒక పని మొదలు పెట్టినప్పుడు అవుతుందో కాదో అని ఆలోచనతో మొదలు పెడతాం. సిద్దిపేట ప్రజల అదృష్టం ఇక్కడ ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతమవుతుంది. తాజాగా పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక సర్వేలో సిద్దిపేట స్టీల్ బ్యాంకును ప్రస్తావించడం, జాతీయస్థాయిలో సిద్దిపేట ఖ్యాతి మరోసారి మారుమోగినట్టు అయింది. ప్రజాప్రతినిధిగా పనిచేయడం ఎంత గొప్పదో దానిని సద్వినియోగం చేసుకోవడం వల్ల వచ్చే ఫలితాలు సంతృప్తిని ఇస్తాయి. ఇక్కడి ప్రజల భాగస్వామ్యం వల్లనే ఇది సాధ్యమైందని, ఇందుకు సహకరించిన అధికారులు, ప్రజలకు అభినందనలు

-తన్నీరు హరీశ్‌రావు,
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

ఆర్థిక సర్వే ముఖ్యాంశాలు

- దేశీయ బొమ్మల పరిశ్రమ ఎగుమతులు పెరిగేందుకు చైనా బొమ్మల దిగుమతులపై కఠిన నిబంధనలు, కస్టమ్స్ సుంకాలను పెంచాలి.
- 2030కల్లా భారతీయ ఔషధ పరిశ్రమ పరిమాణం 130 బిలియన్ డాలర్లను తాకాలంటే ఈ రంగంలో నైపుణ్యాభివృద్ధి, మరిన్ని నూతన ఆవిష్కరణలు అవసరం.
- తయారీ, వస్త్ర పరిశ్రమ, పర్యాటకం, రవాణా రంగాల్లో ఉత్పత్తి, ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహకాలతో నైపుణ్యాభివృద్ధిని అనుసంధానించాలి.
- కృత్రిమ మేధస్సు, రక్షణాత్మక ధోరణులు, సరఫరా ఇబ్బందులతో సేవా, తయారీ రంగాలు ప్రభావితమవుతున్న నేపథ్యంలో దేశీయ పర్యాటక రంగం ద్వారా వస్తున్న ఉద్యోగావకాశాల్ని ఒడిసి పట్టుకోవాలి.
- ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంతో ఆటోమొబైల్, ఆటో విడిభాగాల పరిశ్రమల్లోకి రూ.67,690 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు.
- 2030కల్లా దేశీయ పునరుత్పాదక శక్తి రంగం 500 మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే రూ.30.5 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం.
- భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో ఏర్పడుతున్న సవాళ్లను అధిగమించాలంటే దేశీయ ఎగుమతిదారులు తమ సేవలను మరిన్ని ఇతర దేశాల్లోకి విస్తరించాలి.
- పట్టణీకరణతో ఇండ్లకు డిమాండ్ పెరుగుతున్నది. తద్వారా దేశీయ నిర్మాణ రంగం ఆశాజనకంగా నడుస్తున్నది. అయితే నిలిచిపోతున్న ప్రాజెక్టులు ఆందోళనకరం.
- పరిశ్రమ రూపురేఖల్ని మార్చడంలో గ్రీన్ స్టీల్‌ది కీలకపాత్ర. కర్బన ఉద్గారాల రహిత ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రపంచం అడుగులు వేసేందుకూ ఇది ప్రధానమే.
- ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌లో పెరుగుతున్న రిటైల్ మదుపరుల భాగస్వామ్యం ఆందోళనకరం. జూద ప్రవృత్తిని పెంచేందుకు దోహదం చేస్తున్న పరిణామాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉన్నది.
- సోషల్ మీడియా, అనారోగ్య ఆహారం వంటి వాటిలో గణనీయంగా పెరుగుతున్న ప్రైవేట్ రంగ పెట్టుబడులు. దీనివల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయి.
- భవిష్యత్తులో ఆదాయ అసమానతల్ని ఎదుర్కోవడంలో పన్ను విధానాలే కీలకం. ఉద్యోగ-ఆదాయాలపై ఏఐ వంటి వాటి ప్రభావం ఎక్కువవుతుంది.
- దేశ వాణిజ్య లోటు మున్ముందు మరింత తగ్గుతుంది. ఆయా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతోపాటు దేశీయంగా తయారీ రంగ బలోపేతానికి అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు కలిసొస్తాయి.
- డాటా ప్రైవసీ, పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు.. దేశంలో ఈ-కామర్స్ కార్యకలాపాల వృద్ధికి ప్రధాన అవరోధాలు.
- రవాణా ఖర్చులను తగ్గించడంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ది ప్రధాన పాత్ర.
- ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్న ఐఫోన్లలో భారత్ వాటా 14 శాతం. పెరుగుతున్న దేశీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు
- గత రెండేండ్లుగా అధిక ఆహార ధరలకు వాతావరణ మార్పులు, రిజర్వాయర్లలో పడిపోయిన నీటి నిల్వలు, పంట నష్టాలే కారణం.
- బియ్యం, గోధుమలు, ఇతరత్రా పప్పు ధాన్యాలు ఫ్యూచర్స్ ట్రేడింగ్ నుంచి తప్పించడం ఉత్తమం. ఆయిల్ సీడ్స్, పత్తి, బాస్మతీ రైస్, సుగంధద్రవ్యాలు ఆమోదమే.
- భారతదేశ వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్ల పాత్ర ప్రధానం.
- ఈ ఏడాది దేశంలోకి మరిన్ని రెమిటెన్స్‌లు. 124 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం.
- ఆర్థిక రంగ ముఖచిత్రం బాగున్నది. అయితే ఒడిదొడుకులపై అప్రమత్తత అవసరం.

ఓరుగల్లు కార్పెట్లు ఏపీకి..

పోచమ్మమైదాన్, జూలై 22: ఓరుగల్లు నేత కార్మికులు తయారు చేసిన కార్పెట్లకు ఆంధ్రప్రదేశ్‌లో డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. ప్రతి మూడునెలలకొకసారి అక్కడి ఏపీ స్టేట్ హ్యాండ్ల్యూమ్ వేవర్ కో-ఆపరేటివ్ సొసైటీ(ఆప్కో) ద్వారా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇదే క్రమంలో ఆప్కో టెక్నికల్ అధికారి శ్రీనివాస్ పలు చేనేత సంఘాల నుంచి కార్పెట్లను కొనుగోలు చేశారు. కొత్తవాడ, ఆటోనగర్, ఉప్పుమల్లయ్య తోట, ఎల్‌బీనగర్‌లోని 15 సంఘాల నుంచి దాదాపు 20 వేల కార్పెట్లను ఖరీదు చేశారు. వీటి విలువ రూ.60 లక్షలకు పైనే.

అద్దెకు యూలూ బైకులు

హైదరాబాద్, జూలై 22: అద్దెకు విద్యుత్ వాహనాలు అందించే బెంగళూరుకు చెందిన యూలూ..తాజాగా హైదరాబాద్‌లో తన సేవలు ఆరంభించింది. ఈ సేవలను రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్ నవీన్ దాచూరి మాట్లాడుతూ.. ప్రస్తుతానికి స్విగ్గీ, బ్లింకిట్, జెప్టోతోపాటు ఇతర బ్రాండెడ్ డెలివరీ సంస్థలకు వాహనాలను లీజుకు ఇస్తున్నట్లు, భవిష్యత్తులో సాధారణ ప్రజలకు కూడా ఇచ్చే అవకాశం ఉన్నదన్నారు. గంటకు రూపాయి చొప్పున అద్దె వసూలు చేయనున్నారు.

లాభాల్లో దొడ్ల డెయిరీ

హైదరాబాద్, జూలై 22: దొడ్ల డెయిరీ ఆశాజనక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.65.02 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.34.97 కోట్లతో పోలిస్తే 86 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.918.53 కోట్లకు ఎగబాకింది.

ఫ్యూచరిస్టిక్ సెంటర్!

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రం ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రాధాన్యత అంశంగా పరిశీలిస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఇందుకోసం ఖర్చయ్యే రూ.500 కోట్ల నిధులను సమకూర్చేందుకు ఏదైనా కార్పొరేట్ సంస్థ ముందుకొస్తే ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించనున్నట్లు మంత్రి చెప్పారు. సోమవారం సచివాలయంలో ఫ్యూచరిస్టిక్ కేంద్రంపై పలువురు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి తిలకించారు.

ట్రంప్‌ను ఓడించడమే లక్ష్యం

- డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ సాధించి, గెలుస్తా!
- కమలా హారిస్ ఆశాభావం

వాషింగ్టన్, జూలై 22: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా తనను అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ తరపున అధ్యక్ష నామినేషన్‌ను సాధించి, ఎన్నికల్లో గెలుస్తానని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించడమే తన లక్ష్యమన్నారు. ట్రంప్‌ను ఓడించడంలో దేశాన్ని ఏకం చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హారిస్ పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల బరిలో నుంచి తప్పుకొంటున్నట్టు బైడెన్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన డెమొక్రటిక్ పార్టీ తరపున కొత్త అభ్యర్థినా కమలా హారిస్ పేరును ప్రతిపాదించారు. కాగా, అధ్యక్ష పోటీ నుంచి వైదొలుగుతున్నట్టు బైడెన్ ప్రకటించిన తర్వాత కమలా హారిస్ తొలి అధికారిక ప్రసంగం చేశారు. బైడెన్ గొప్ప నాయకుడని, ఆయన నాయకత్వానికి సాటిలేదని పేర్కొన్నారు.

కమలకు పలువురు డెమోక్రాట్ల నుంచి గట్టి పోటీ

బైడెన్ అధ్యక్ష ఎన్నికల నుంచి తప్పుకోవడంతో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా రేసులో కమలా హారిస్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. అయితే పార్టీ నామినేషన్ విషయంలో ఆమెకు పలువురు డెమోక్రాట్ల నుంచి పోటీ ఎదురయ్యే అవకాశం కనిపిస్తున్నది. అధ్యక్ష నామినేషన్ రేసులో కెంటుక్కీ, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా గవర్నర్లు అండీ బేషీర్, కూపర్, జోష్ షాప్రియో, అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇల్లినాయిస్, మిచిగాన్, కాలిఫోర్నియా గవర్నర్లు జేడీ ప్రిట్జ్‌కర్, గ్రెచెన్ విట్మర్, గవిన్ న్యూసోమ్‌లు కూడా రేసులో ఉన్నారు.

అరెస్టయిన నేతల వర్చువల్ ప్రచారానికి సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ: వివిధ కేసుల్లో అరెస్టయి, జైలులో ఉన్న రాజకీయ నేతలు ఎన్నికల్లో వర్చువల్‌గా ప్రచారం చేయడానికి అవకాశం కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన ఢిల్లీ హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని తెలిపింది. ఈ పిటిషన్‌ను న్యాయ శాస్త్ర విద్యార్థి అమర్‌జీత్ గుప్తా దాఖలు చేశారు.

వైద్యుల నిర్లక్ష్యం.. 20 ఏండ్ల తర్వాత పరిహారం

బెంగళూరు: శస్త్రచికిత్స సమయంలో వైద్యుల నిర్లక్ష్యానికిగాను కొన్నేండ్లపాటు తీవ్రమైన కడుపు, నడుము నొప్పితో బాధపడిన మహిళకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలంటూ కర్ణాటక వినియోగదారుల ఫోరం 20 ఏండ్ల తర్వాత ఆదేశించింది. బెంగళూరుకు చెందిన పద్మావతి 32 ఏండ్ల వయసులో హెర్నియా ఆపరేషన్ కోసం 2004 సెప్టెంబర్ 29న దీపక్ దవాఖానలో చేరింది. సర్జరీ పూర్తయ్యాక ఆమె అపెండిక్స్‌ను కూడా తొలగించారు. ఆ తర్వాతి రోజే ఆమె కడుపునొప్పితో బాధపడగా వైద్యులు కొన్ని నొప్పి నివారణ మాత్రలు ఇచ్చి పంపించారు. ఆ తర్వాత కూడా ఆమె తీవ్రమైన కడుపునొప్పి, నడుము నొప్పితో బాధపడగా అదే దవాఖానలో రెండుసార్లు చేరింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో 2010లో మరో ప్రైవేటు దవాఖానలో చూపించుకుంది. అక్కడామెకు స్కానింగ్ చేసిన వైద్యులు ఆమె పొత్తికడుపులో 3.2 సెంటీమీటర్ల సర్జికల్ సూది ఉన్నట్టు గుర్తించి తొలగించారు. అనంతరం ఆమె తనకు తొలుత ఆపరేషన్ చేసిన దీపక్ దవాఖాన వైద్యుల నిర్లక్ష్యంపై వినియోగదారుల కోర్టుకెక్కింది.

ఆహారం కోసం సైనికులతో బలవంతంగా శృంగారం
సూడాన్‌లో మహిళల దైన్యస్థితి

ఖార్టూమ్, జూలై 22: యుద్ధంతో ఛిన్నాభిన్నమైన సూడాన్‌లో మహిళల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఆహారం కోసం వారు బలవంతంగా సైనికులతో శృంగారంలో పాల్గొనాల్సి వస్తున్నట్టు 'గార్డియన్' పత్రిక వెల్లడించింది. తమ కుటుంబాల పోషణ కోసం ఆహారాన్ని లేదా సరుకులను పొందాలంటే సైనికుల కామవాంఛలను తీర్చడం మినహా మరో మార్గం లేకపోయిందని ఒండుర్మన్ నగరం నుంచి పారిపోయి వచ్చిన రెండు డజన్ల మందికిపైగా మహిళలు వాపోయినట్టు పేర్కొన్నది. ఒండుర్మన్ నగరంలో ఆహార నిల్వలున్న దాదాపు అన్ని కర్మాగారాల్లో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిపింది. 'ఎంతో వృద్ధులైన నా తల్లిదండ్రులిద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆహార సేకరణ కోసం నా కుమార్తెను ఎన్నడూ బయటికి పంపలేదు. అందుకు బదులుగా నేనే సైనికుల వద్దకు వెళ్లా. ఆహారాన్ని పొందేందుకు ఇంతకంటే వేరే గత్యంతరం లేకపోయింది' అంటూ ఓ మాంసం శుద్ధి కర్మాగారం వద్ద బలవంతంగా సైనికులతో శృంగారంలో పాల్గొన్న ఓ మహిళ కన్నీటిపర్యంతమైనట్టు 'గార్డియన్' వివరించింది.

'కన్వర్' మార్గంలో నేమ్‌ప్లేట్ల ఏర్పాటుపై స్టే

న్యూఢిల్లీ, జూలై 22: కన్వర్ యాత్ర మార్గంలోని హోటళ్లు వాటి యజమానుల పేర్లను ప్రదర్శించాలన్న యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం మధ్యంతర స్టే విధించింది. 'ఆహారాన్ని అమ్మేవాళ్లు వారు అమ్మే ఆహార వివరాలు ప్రదర్శించొచ్చు కానీ తమ యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని ఒత్తిడి చేయకూడదు' అని కోర్టు తెలిపింది. ఈ కేసు విచారణకు రాష్ట్ర ప్రభుత్వాల తరపున ఎవరూ హాజరు కాలేదు. హోటళ్ల యజమానుల పేర్లు ప్రదర్శించడం కొన్ని వర్గాల మధ్య వైరుధ్యాల్ని తీవ్రం చేస్తాయని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, అసోసియేషన్ ఆఫ్ సివిల్ రైట్స్ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాయి. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం హోటళ్లు తమ యజమానుల పేర్లు ప్రదర్శించాల్సిన అవసరం లేదని పిటిషనర్ల తరపు న్య